

పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

సర్వాయి పాపన్న త్యాగాలు మరువలేనివి

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వీరత్వానికి ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్న త్యాగాలు నిలిచాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని డబిల్‌గూడ గ్రామంలో నెలకొల్పిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న కేవలం గౌడ కులస్తులకే కాకుండా బడుగు, బలహీన వర్గాల కోసం వీరోచితంగా పోరాటం చేశారన్నారు. ఎందరో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని, అందులో పాపన్న పాత్ర ముఖ్య భూమిక పోషించిందన్నారు. సర్వాయి పాపన్న ఆశయ సాదనకు రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. మహనీయుల త్యాగాలను భవిష్యత్ తరాలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, యాదయ్యగౌడ్, యాదీష్, శంకర్, డబిల్‌గూడ గౌడ సంఘం నాయకులు శేఖర్, బాలకృష్ణ, పాండు పాల్గొన్నారు.



చేవెళ్ల: హైదరాబాద్, బీజాపూర్ హైవేపై..



యాచారంలో..

మంచు కురిసే వేళలో..

బారెడు పొద్దెక్కినా సూరీడు కానరాలేదు. చందమామలా కనువిందు చేశాడు. ఉదయం తొమ్మిది అయినా మంకురు వీడిపోలేదు. పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకొని మరీ ముందుకు వెళ్లారు. కొందరు పక్కన ఆపుకొని అంతా తేరుకున్నాక బయలుదేరారు. ఈ దృశ్యాలు శుక్రవారం యాచారం మండలం హైదరాబాద్, నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై, చేవెళ్ల మండలం హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారిపై ఆవిష్కృతమవగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది. పొగమంచులో ప్రమాదాలు జరుగకుండా పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేశారు.

యాచారం/చేవెళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

సాంకేతిక విద్యతో సమాజ అభివృద్ధి

» రాష్ట్ర సాంకేతిక విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

ఆదిభట్ల జనవరి 24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యతో సమాజాభివృద్ధి జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని సాంకేతిక విద్యా కళాశాలాల నుంచి నిర్మాణాత్మక సూచనలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి చైర్మన్ జేఎన్‌టీయూ ఇన్‌చార్జి ఉపకులపతి డాక్టర్ బాలకిష్టారెడ్డి అన్నారు. మంగల్‌పల్లి సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరుగనున్న సస్టెయినబుల్ మెటీరియల్స్, టెక్నాలజీస్ అప్లికేషన్స్ ఇన్ ఇంజినీరింగ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సుకు హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న అనేక సవాళ్లలో వాతావరణ మార్పులు, సహజ వనరుల తగ్గుదల వంటి సమస్యలు ఉన్నాయని, వీటి గురించి కళాశాలల్లో మేధావులను ఆహ్వానించి సలహాలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి మానవాళికి దోహదపడాలేలా ఉండాలని, వినాశకారిగా మారకూడదన్నారు. సాంకేతిక విద్యా కళాశాలలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతోపాటు అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉంటే ఆ కళాశాలల సమీపంలోని ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. స్ట్రక్చరల్, జియోటెక్నికల్, ట్రాన్స్‌పోర్టేషన్, వాటర్‌రిసోర్సెస్, కన్‌స్ట్రక్షన్ తదితర విభాగాల్లో డిస్కషన్స్, ఇన్నోవేటివ్ ఐడియాస్‌తో సదస్సు సాగాలన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ చిరబుడ్డి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ రామశాస్త్రి, నాగమల్లేశ్వరరావు, శివారెడి పాల్గొన్నారు.

వైద్యసేవలపై ఆరా



ఫ్లోరింగ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధారాణి

యాచారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆరోగ్య ఉపకేంద్రం స్లాబ్ వానాకాలంలో కురుస్తుందని సిబ్బంది ఆమె దృష్టికి తెచ్చారు. ఫ్లోరింగ్ పగిలిపోవడం చూసి విస్తుపోయారు. బండలు ఎలా పగిలాయని ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతగా చేపట్టకపోవడంతో బండలు పగిలినట్లు స్థానికులు చెప్పారు. ఆస్పత్రి బాగుకు దాతలు ముందుకు వచ్చేలా కృషి చేయాలని కోరారు. బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆస్పత్రి మరమ్మతులకు ఒప్పుకున్నట్లు తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీల్లో రేపటి(ఆదివారం, 26వ తేదీ)తో పాలకవర్గాల గడువు ముగియనుంది. దీంతో 27వ తేదీ నుంచి ప్రత్యేక పాలనను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఇకనుంచి నిర్ణయాలన్నీ ప్రత్యేకాధికారులు తీసుకోనున్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 14 బల్దియాలు, 3 కార్పొరేషన్లు, మేడ్చల్ జిల్లాలో తొమ్మిది పురపాలికలు, ఐదు కార్పొరేషన్లు ఉన్నాయి. వికారాబాద్‌లో ఐదేళ్ల కిందట అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులు నాలుగు పుర పీఠాలను కైవసం చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యేలతో విబేధించి వికారాబాద్, కొడంగల్ చైర్మన్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎన్నికల తర్వాత తాండూరు చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.



బల్దియాల్లో ప్రత్యేక పాలన!

రేపటితో ముగియనున్న పాలకవర్గాల గడువు

	మున్సిపాలిటీలు	కార్పొరేషన్లు
రంగారెడ్డి	14	03
వికారాబాద్	04	00
మేడ్చల్	09	05

దృష్టంతా పెండింగ్ బిల్లులపైనే..

27నుంచి అధికారుల పాలనకు సన్నాహాలు

ఉమ్మడి జిల్లాలో 27 మున్సిపాలిటీలు, 8 కార్పొరేషన్లు

మున్సిపాలిటీలు	వార్డులు
తాండూరు	36
వికారాబాద్	34
పరిగి	15
కొడంగల్	12
ఆదిభట్ల	15
ఇబ్రహీంపట్నం	24

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 34 వార్డులు ఉండగా, అయిదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ 24 వార్డుల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ 7 వార్డులు, బీజేపీ, ఎంఐఎం, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఒక్కో వార్డుల్లో గెలుపొందారు. రెండున్నరేళ్ల పూర్తి కాక ముందే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల మార్పుకు తీవ్రంగా ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో విబేధించిన చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగంలతో పాటు పలువురు కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. పదవీ కాలం ముగిసే సమయంలో కాంగ్రెస్ పార్టీకి 16 మంది కౌన్సిలర్లు ఉండగా,

మిగతా 7వ పేజీలో...



వేతనాల చెల్లింపులో ఆలస్యం

తమ పదవీ కాలం రేపటితో ముగియనుండడంతో పాలకవర్గాలు అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లులపై దృష్టి కేంద్రీకరించాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులు ఇటీవల విడుదల కావడంతో పదవీకాలం ముగిసే సమయంలో పాలకవర్గాలకు కొంత ఊరట కలిగిందనే చెప్పాలి. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో బిల్లులు వసూలు కాక కార్మికులకు, ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు పాలక వర్గాలపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బల్దియాల ఖజానాలో ఉన్న నిధులకు, చెల్లించాల్సిన బిల్లులకు పొంతన కుదరకపోవడంతో పాలకవర్గాల బాధ్యులు తలపట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల బిల్లుల చెల్లింపుల విషయంలో మునిసిపల్ చైర్మన్లకు, అక్కడి కమిషనర్ల మధ్య బేధాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయంటూ ప్రచారమవుతోంది. తమ పదవీ కాలం ముగియక ముందే పెండింగ్ బిల్లులను క్లియరెన్స్ చేయడంతో పాటు కొత్త అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు పాలకవర్గాలు సన్నాహాలు చేసుకుంటున్నాయి.



సీపీఎం నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఫ్యూచర్ సిటీ పేరుతో పేదల పొట్టకొట్టొద్దు

» ఆర్డీవోకు సీపీఎం నేతల వినతి

కందుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్ సిటీల పేరుతో పేదల పొట్టకొట్టొద్దని, కార్పొరేట్ సంస్థలకు విలువైన భూములు కట్టబెట్టడానికి ప్రభుత్వం కుట్రలు పన్నిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, పార్టీ కార్యదర్శి యాదయ్య అన్నారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఆవరణలో మండలంలోని మీర్ఖాన్‌పేట, బేగరికంచ గ్రామాల రైతులతో సదస్సు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ, ఫోర్త్‌సిటీ పేరుతో రావిరాల ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఆమనగల్లు మండలం వరకు 330పీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రోడ్డుకు 1,004 ఎకరాల విలువైన భూములను 4,725 మంది రైతుల నుంచి అతి తక్కువ ధరకు తీసుకోవడం సరైంది కాదన్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో భూమికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడిగా దుబ్బాక రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుబ్బాక రాంచందర్, బుట్టి బాల్‌రాజ్, జగన్, మధుసుదన్‌రెడ్డి, కవిత, జంగయ్య, పెంటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తులు 3,98,719

ఉమ్మడి జిల్లాలో వినతుల వెల్లువ

నాలుగు పథకాలకు పెద్దసంఖ్యలో అర్జీలు

చివరిరోజు అక్కడక్కడ నిరసనలు

ముగిసిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు

ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 3,98,719 దరఖాస్తులు అందాయి. చివరి రోజు శుక్రవారం అక్కడక్కడ నిరసనలు వెల్లువెత్తాయి. పలుచోట్ల ప్రజలు.. అధికారులతో వాగ్వాదానికి దిగారు.



యాచారం: తాటిపర్తి సభలో ప్రజలను సముదాయిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్‌సాగర్

వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో చివరి రోజు ఏకంగా 26,788 దరఖాస్తులు రావడం విశేషం. సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు జిల్లాలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డు సభలు ముగిసాయి. జిల్లాలో మొత్తం 568 గ్రామ పంచాయతీలు, 4 మునిసిపాలిటీల పరిధిలో 97 వార్డులు ఉండగా, అన్నింట్లోనూ ప్రజాపాలన సభలు నిర్వహించారు. శుక్రవారం జిల్లాలో మొత్తం 93 చోట్ల గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. కాగా, ప్రజాపాలన సభల్లో అక్కడక్కడ నిరసనలు వ్యక్తమైనా మొత్తం మీద ప్రశాంతంగానే ముగిసాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం తయారు చేసిన జాబితాల్లోని

మిగతా 6వ పేజీలో...

జిల్లాల వారీగా దరఖాస్తుల వివరాలు

పథకాలు	వికారాబాద్	రంగారెడ్డి	మేడ్చల్
రేషన్ కార్డులు	58,784	79,809	34,719
ఇందిరమ్మ ఇళ్లు	26,312	37,127	1,43,267
రైతు భరోసా	3,745	880	642
ఆత్మీయ భరోసా	7,582	4,870	982
మొత్తం	96,423	1,22,686	1,79,610



అవగాహన కార్యక్రమంలో ఎస్పీ సాయి చైతన్య

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శంకర్‌పల్లి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాంటి నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య సూచించారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలు- వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు విద్యార్థులు నడుంబిగించాలన్నారు. మాదక ద్రవ్యాలతో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ విశ్వనాథ్, జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రావు, డైరెక్టర్ వేణుగోపాల్‌రావు, డీఎస్పీ హరిచంద్రారెడ్డి, సీఐలు వీరబాబు తదితరులు ఉన్నారు.



చిలుకూరులో ప్రత్యేక పూజలు

మొయినాబాద్ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి దర్శనం చేయించారు. దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్ల నర్సింహాచారి, సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, కమిటీ సభ్యులు రమేష్, జ్ఞానేశ్వర్, విజయ్‌కుమార్, నర్సింహాచారి, రాధ, వడ్డె రమేశ్, కృష్ణగౌడ్, దశరథ, పరమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాడతాం

తలకొండపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేసే వరకూ ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. రిలే దీక్షలు శుక్రవారం 85వ రోజుకు చేరాయి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్

తాండూరు రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలో అర్హులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్‌తో కలిసి సంగెంకలాన్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. తమ గ్రామంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసాను అందిస్తామన్నారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ జాబితాలో, రేషన్ కార్డులో పేర్లు రాని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంగెంకలాన్‌లో రైతు భరోసా 10, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 16, ఇందిరమ్మ ఇళ్లు 20 దరఖాస్తులు అందాయి. చెంగోల్‌లో 276 అంతారంలో 157 దరఖాస్తులు వచ్చాయని, మండలంలో మొత్తం 544 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు సాయిప్రణీత్, ప్రతిభ, వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాందాస్, వడ్డె శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, లాలప్ప, రవి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో ఎంపీడీవో విశ్వప్రసాద్‌తో కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌కుమార్ శర్మను అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలో 1 నుంచి 7 తరగతులకు గాను 109 మంది విద్యార్థులు, 7గురు ఉపాధ్యాయులు, మరో ఇద్దరు విద్యావలంటీర్లు కొనసాగుతున్నారని తెలిపారు. పాఠశాలలో చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం రవీందర్‌గౌడ్‌ను ఎంపీడీవో విశ్వప్రసాద్, ప్రత్యేకాధికారి సాయిప్రణీత్‌లను సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాందాస్, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, లాలప్ప, రవి తదితరులున్నారు.


సంగెంకలాన్ గ్రామసభలో మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

డ్రైవర్ల పాత్ర కీలకం


బెస్ట్ డ్రైవర్ నర్సింగ్‌రావును సన్మానిస్తున్న డీఎం అరుణ

వికారాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ గడ్డం అరుణ అన్నారు. డ్రైవర్ల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున డిపో ఆవరణలో నిర్వహించిన డ్రైవర్ల దినోత్సవ కార్యక్రమంలో 18 సంవత్సరాలుగా ఒక్క ప్రమాదం కూడా జరగకుండా అప్రమత్తంగా డ్యూటీ నిర్వహించిన కె.నర్సింగ్‌రావును డీఎం శాలువాతో సన్మానించారు. కండక్టర్లు, ఇతర సిబ్బంది గులాబీపూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ డ్రైవర్ నర్సింగ్ రావుకు కండక్టర్లు, ఇతర సిబ్బంది గులాబీపూలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ నర్సిములు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల స్వేచ్ఛను హరించొద్దు

కీసర రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లల స్వేచ్ఛను హరించే వారి పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రాంచంద్రయ్య అన్నారు. శుక్రవారం నాగారంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో బాలికా దినోత్సవం సందర్భంగా ఆడపిల్లను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం, బతకనిద్దాం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ స్వప్న, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, శ్రవణ్ పాల్గొన్నారు.

బాబాను దర్శించుకుంటే అంత శుభమే


ప్రత్యేక ప్రార్థనల్లో ప్రీతం తదితరులు

కొత్తూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జహంగీర్ బాబాను దర్శించుకుంటే అంత మంచే జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను శుక్రవారం ఆయన దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రీతం దర్గాకు చేరుకోగానే ముజావర్లు తలపాగా చుట్టి స్వాగతం పలికారు. దర్గాలో ప్రార్థనల అనంతరం అయనకు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రొల్ల సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆగీర్ రవికుమార్‌గుప్త, కొమ్ము కృష్ణ, ప్రభు, జంగారి రవి, ఎర్రొళ్ల జగన్, జెనిగె శివ, రాజేందర్, నేదునూరి శ్రీను, నాగిళ్ల భాస్కర్, అనంతయ్య, కోస్గి యాదగిరి, రవికుమార్, సాయిలు, నరేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే యువతకు ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి అవశాశాలు లభించాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో 25 పరిశ్రమలు సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆమె ప్రారంభించారు. సబితారెడ్డి మాట్లాడుతూ చదువుకున్న యువతకు ఉపాధి కల్పించాలని కేసీఆర్ పరితపించేవారన్నారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, షాబాద్ తదితర ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటయ్యాయని తెలిపారు. జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి 490 మంది యువతీ యువకులు హాజరయ్యార.. ఇందులో 300 మందికి ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన వారికి సబితాఇంద్రారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. పరిశ్రమల ప్రతినిధులు, మండల బీఆర్ఎస్ నాయకులు డి.వెంకటేశ్వర్‌రెడ్డి, రాజునాయక్, పాండుయాదవ్, దేవ్లానాయక్, రవి, మోతీలాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి

చేవెళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. రోడ్డు భద్రతపై చేవెళ్ల మండల కేంద్రంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదని, ఎట్టి పరిస్థితుల్లో బైక్‌లు రోడ్డుపై పార్కు చేయరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై ఆశోక్, ఏఎస్సై చందరన్ నాయక్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులు 3,98,719

(5వ పేజీ తరువాయి)

వారి పేర్లు వార్డు, గ్రామ సభల్లో చదివి వినిపిస్తుండగా, ఆ జాబితాల్లో చోటు దక్కని అర్హుల నుంచి అధికారులకు నిరసనలు ఎదురయ్యాయి. చివరి రోజైన శుక్రవారం తాండూరు మునిసిపల్ పరిధిలో జరిగిన వార్డు సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రయత్నించగా, పోలీసులు జోక్యం చేసుకుని ఆ ప్రయత్నాన్ని విఫలం చేశారు. తాండూరు మండలం, అంతారం గ్రామసభలో అర్హులకు ఇళ్లు రాలేవని, ఇళ్లు ఉన్న వారికే మళ్లీ ఇండ్లు మంజూరు చేశారంటూ అధికారులను ప్రశ్నించారు. నవాబ్‌పేటలో జరిగిన గ్రామ సభలో గత ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయంటూ అధికారులను ప్రజలు నిలదీశారు. కోట్‌పల్లి మండలం, ఎన్నారంలో ప్రభుత్వ పథకాలు అర్హులకు రాలేవంటూ ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాచారం మినహా..

రంగారెడ్డి జిల్లాలో నాలుగు రోజుల పాటు మొత్తం 924 సభలు జరగగా అందులో గ్రామసభలు 549, వార్డు సభలు 375 జరిగాయి. చివరి రోజు మొత్తం 11,121 దరఖాస్తులను స్వీకరించారు. అందులో రేషన్ కార్డుల కోసం 6,263 దరఖాస్తులు రాగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 3,666 దరఖాస్తులు వచ్చాయి. రైతు భరోసా కింద 168 దరఖాస్తులు రాగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 1,024 దరఖాస్తులు వచ్చాయి. కాగా, జిల్లాలో యాచారం మండలం మినహా మిగతా అన్ని చోట్ల ప్రజాపాలన సభలు ప్రశాంతంగా జరిగాయి. చివరి రోజు శుక్రవారం యాచారం మండలం తాటివనపర్తిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై ప్రజలు అధికారులను నిలదీశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామసభ రాసాభాసగా మారింది. ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడటంతో సీఐ కృష్ణంరాజు గ్రామ సభ వద్దకు చేరుకుని సముందాయిచే ప్రయత్నం చేశారు. అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని నచ్చచెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నాలుగు రోజుల వ్యవధిలో 351 సభలు జరిగాయి. అందులో 62 గ్రామ సభలు, 289 వార్డు సభలు ఉన్నాయి.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని సీడాక్ సంస్థ సైంటిస్ట్ జ్యోత్స్న గ్రంధి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులేనని, నిత్యం పఠనం చేయాలన్నారు. నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు బోధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అమీర్, సుస్మిత, మంగళగౌరీ, హరికృష్ణ, నరేందర్‌సింగ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్ల గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దు



వినతిపత్రం అందజేస్తున్న ఊరెళ్ల గ్రామస్తులు

చేవెళ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఊరెళ్ల గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఊరెళ్ల గ్రామస్తులందరు ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ల వద్ద మున్సిపాలిటీలో కలపొద్దని తమ గ్రామాన్ని కలపొద్దని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులను కలిసి చేవెళ్ల వినతిపత్రం అందించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్ల గ్రామాన్ని కలిపితే అన్నివిధాలా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. చేవెళ్లకు దగ్గరగా ఉన్న గ్రామాలను వదిలిపెట్టి దూరంగా ఉన్న ఊరెళ్లను విలీనం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం విషయమై చర్యలు తీసుకొని లిస్టు నుంచి పేరును తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఊరెళ్ల గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

జినుగుర్తిలో అలహాబాద్ హైకోర్టు జడ్జి



పుష్పగుచ్ఛం అందిస్తున్న తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ శివలీల

తాండూరు రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తి శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్(సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని)ను శుక్రవారం రాత్రి 7గంటలకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్ హైకోర్టు జడ్జి వినోద్ దివాకర్ సందర్శించారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లో సేంద్రియ వ్యవసాయ విధానాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పంటల సాగు, వ్యవసాయ కళాశాల తదితర విషయాలపై ఆయనకు క్లుప్తంగా వివరించారు. ప్రతినెలా రెండు సార్లు కళ్లల్లో ఉచిత చుక్కల మందును వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ శివలీల అలహాబాద్ హైకోర్టు మెజిస్ట్రేట్ వినోద్ దివాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

ముమ్మరంగా జిల్లా స్థాయి ఖేల్ కుద్ పోటీలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

పరిగి రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఖేల్ కుద్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని స్థానిక శిశుమందిర్ పాఠశాలలో ఈ పోటీలు ప్రారంభం కాగా తాండూరు, వికారాబాద్, పరిగి పాఠశాలల నుంచి 287 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రస్సకించ్, క్యారమ్స్, చెస్, పరుగు పందెం, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి. పోటీల్లో పరిగికి చెందిన 27 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందినవారు ఫిబ్రవరిలో జరిగే విభాగ్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, స్థానిక పాఠశాల ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాల సమితి జిల్లా కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు, ప్రాంత ఖేల్ కుద్ ప్రముఖ్ భీంసేన్‌రావు, సమితి అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య, పాఠశాల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఎ.వెంకటేశం, ప్రముఖ్ ఆర్. నర్సింహులు, ప్రధానాచార్యులు కె.మల్లేష్ పాల్గొని విద్యార్థులకు తగు సూచనలు సలహాలు చేశారు.



కందుకూరు : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

కందుకూరు/కడ్తాల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులు, సమానత్వంపై ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని, వారి సంరక్షణకు పాటుపడాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని కందుకూరు గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనిత మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఆడపిల్ల చదువు అవనికి వెలుగని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఆమనగల్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డిలు అన్నారు. కడ్తాల కేజీబీవీలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు వెంకటేశ్, నరేశ్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు టీచర్లు పాల్గొన్నారు.



కడ్తాల : కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్‌రెడ్డి

బల్దియాల్లో ప్రత్యేక పాలన!

(5వ పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌కు 15 మంది, బీజేపీ, ఎంఐఎంలకు ఒక్కో కౌన్సిలర్ ఉన్నారు. కాగా, రామయ్యగూడ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.నర్సింహులు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే.

తాండూరులో 36 వార్డులు

తాండూరు మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉన్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 20, బీజేపీ 7, కాంగ్రెస్ 4, ఎంఐఎం 3, తెలంగాణ జన సమితి, సీపీఎం ఒక్కో వార్డులో విజయం సాధించారు. ఎక్కువ వార్డుల్లో విజయం సాధించిన బీఆర్ఎస్‌కు చెందిన స్వప్న పరిమళ్ చైర్‌పర్సన్‌గా, దీపా నర్సిములు వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అప్పటి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మహేందర్‌రెడ్డి వర్గీయులైన వారి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూ వచ్చింది. దాంతో చైర్‌పర్సన్ పీఠం నుంచి స్వప్న పరిమళ్‌ను తప్పించి ఆ స్థానంలో వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సిములును చైర్‌పర్సన్‌గా నియమించేందుకు వ్యతిరేకవర్గం తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత స్వప్న పరిమళ్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉండగా, బీఆర్ఎస్‌కు 13, బీజేపీకి 5, తెలంగాణ జన సమితి, ఎంఐఎంలకు ఒక్కో కౌన్సిలర్ ఉన్నారు.

పరిగిలో పెట్టని అవిశ్వాసం

పరిగి బల్దియాలో 15 వార్డులు ఉండగా, గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 9 వార్డుల్లో, కాంగ్రెస్ 6 వార్డుల్లో విజయం సాధించింది. మెజార్టీ వార్డుల్లో విజయం సాధించిన బీఆర్ఎస్‌కు చెందిన ముకుంద అశోక్ చైర్మన్‌గా, కల్లు ప్రసన్నలక్ష్మి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్లపై అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు విశ్వప్రయత్నాలు జరిగినా.. పరిగిలో మాత్రం ఆ ప్రయత్నం జరగలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరినా.. ఆ కౌన్సిలర్లలో ఒకరు ఇటీవల తిరిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం పరిగిలో బీఆర్ఎస్‌కు 10 మంది, కాంగ్రెస్‌కు 5 మంది కౌన్సిలర్లు కొనసాగుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో 14 బల్దియాలు

రంగారెడ్డి జిల్లాలో 14 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. ఆదిభట్ల, ఆమనగల్లు, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, మణికొండ, నార్సింగి, పెద్ద అంబర్‌పేట్, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తలకొండపల్లి, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో ఈ సారి కొత్తగా చేవెళ్ల మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్-జిల్లెలగూడ మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఆదిభట్ల మున్సిపాలిటీలో 15 వార్డులు ఉన్నాయి. మున్సిపల్ చైర్మన్ పదవి కాంగ్రెస్ వశం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ.. గత ప్రభుత్వ హయంలో కాంగ్రెస్‌కు చెందిన కొత్త ఆర్థిక బీఆర్ఎస్‌లోకి చేరింది. ఎక్స్‌అఫిషియల్ ద్వారా ఆమెకు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఏడాదిన్నర కాలం పాటు ఆమె బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. అప్పటి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఆమెకు పోవడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కాంగ్రెస్ పార్టీలో చైర్మన్‌గా ఉన్న ఆమెపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. చైర్మన్ కొత్త ఆర్థిక మినహా మిగతా 14 మంది కౌన్సిలర్లు కొత్తగా మర్రి నిరంజన్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లోకి ఆహ్వానం

కొడంగల్ బల్దియాలో 12 వార్డులు ఉన్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 10 వార్డుల్లో విజయం సాధించగా, 2 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపొందింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన జగదీశ్వర్‌రెడ్డి చైర్మన్‌గా, వైస్ చైర్‌పర్సన్‌గా ఉషారాణి ఎన్నికయ్యారు. అప్పటి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయి. అప్పటి ఎమ్మెల్యేకు, బల్దియా చైర్మన్ మధ్య కూడా అంతరం పెరిగింది. విషయం గుర్తించిన రేవంత్‌రెడ్డి గురునాథ్‌రెడ్డిని, ఆయన కుమారులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం కొడంగల్ మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు 11 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు ఒక కౌన్సిలర్ ఉన్నారు.

ఎంతో అభివృద్ధి చేశాం



షాద్‌నగర్ మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశాం. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాం. అంతర్గత రోడ్లను ప్రధాన రహదారికి అనుసంధానం చేశాం.. కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకున్నాం. సహచర కౌన్సిలర్లు పూర్తి సహకారం అందించారు. ఇటీవల సీడీఎంఏ నిధుల నుంచి మున్సిపాలిటీకి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో వెంచర్లలో 10 శాతం స్థలాన్ని రక్షించాలని కోరుతున్నాం. బీఆర్ఎస్‌ను వదిలి ఇవెళ్లే ఆలోచన లేదు.

- కొందూటి నరేందర్, మున్సిపల్ చైర్మన్, షాద్‌నగర్

ఇబ్రహీంపట్నంలో నెగ్గిన అవిశ్వాసం

ఇబ్రహీంపట్నం మున్సిపాలిలో 24 వార్డులు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీ చైర్మన్ కప్పరి స్రవంతి బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఆమె కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆమెపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. బీఆర్ఎస్‌లో కొందరు కౌన్సిలర్లు ఆమెకు మద్దతు ప్రకటించడంతో అవిశ్వాసం నెగ్గింది. మేడ్చల్ జిల్లాలో ఐదు మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. బోడుప్పల్, హైదరాబాద్, జవహర్‌నగర్, నిజాంపేట్, పెర్జాగూడ కార్పొరేషన్లుగా కొనసాగుతున్నాయి. దమ్మాయిగూడ, దుండిగల్, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, కొంపల్లి, మేడ్చల్, నాగారం, పోచారం, తూముకుంట మున్సిపాలిటీలు ఉన్నాయి.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న బలరామకృష్ణ

శంకర్‌పల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారినుద్దేశించి ప్రసంగించారు. అమ్మాయిలు మోసాల పట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజ్వల సంస్థ గత 28 సంవత్సరాల నుంచి మానవ అక్రమ రవాణాను అరికడుతూ 29,500 మంది అమ్మాయిలను కాపాడటం జరిగిందన్నారు. సూపర్‌వైజర్ యశస్విని, సీనియర్ కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ సింహపురి ఇన్‌చార్జిగా నరేందర్



శంషాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ కు చెంది న పీసీసీ(ఎస్సీ విభా గం) ఉపాధ్యక్షుడు జె.నరేందర్ ఢిల్లీలోని సింహపురి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ ప్రీతమ్ నగరిగరి పేర్కొన్నారు. నరేందర్ పార్టీ తరఫున మహారాష్ట్ర, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకంతో ఇన్‌చార్జిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గంధోత్సవం



ఆమనగల్లు : గంధోత్సవంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



చౌదరిగూడ : ప్రత్యేక పూజల్లో తహసీల్దార్ జగదీశ్వర్, పోలీసులు తదితరులు

ఆమనగల్లు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సమాజ శాంతి స్థాపనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. భైరాపూర్‌లోని సైదులు దేవుడు దర్గా వద్ద శుక్రవారం నిర్వహించిన గంధోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సుంకిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ఐక్యత ఫౌండేషన్ ద్వారా రూ.2.50 లక్షలతో షెడ్లు నిర్మించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని దర్గా నిర్వాహకులు, స్థానికులు సత్కరించి అభినందించారు. ఫౌండేషన్ సభ్యులు, నాయకులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండల్, తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లిలో నిర్వహించిన ఉర్సులో భాగంగా శుక్రవారం సాయంత్రం మొదటి రోజు గుర్రంపీర్‌కు అధికారులు, గ్రామస్తులు గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు విజయ్, కృష్ణ, గ్రామస్థులు, మల్లేష్, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గేదె @ రూ.4.50 లక్షలు

- నార్సింగ్ పశువుల జాతరలో రికార్డు ధర
- రూ. 2.50లక్షలు పలికిన ధూలియా గేదే



నార్సింగ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నార్సింగ్ వ్యవసాయ మార్కెట్‌లో పశుసంక్రాంతి పశువుల సంత జోరుగా సాగింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయి ధరలో గేదెను రూ.4.50 లక్షలకు విక్రయించారు. ధూలియా జాతీ గేదే నార్సింగ్‌కు చెందినరైతు ముఖ్తార్ నల్లగండ్లకు చెందిన వెంకటరెడ్డికి విక్రయించారు. నార్సింగ్ మార్కెట్ చరిత్రలో ఇదే రికార్డు స్థాయి విక్రయంగా ప్రభుత్వ ఖాతాలో రిజిస్టర్ చేశారు. ఈ గేదెను మార్కెట్ కమిటీ చైర్మన్ కోటా వేణుగౌడ్ ఒకశాతం ట్యాక్స్ రశీదును వారికి అందించారు. ఈ జాతీయ పశువుల జాతరను నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోటా వేణుగౌడ్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సారి రికార్డుస్థాయిలో ధూలియా గేదేలు రూ.2.50లక్షల చొప్పున నాలుగు విక్రయించారు. వట్టినాగులపల్లికి చెందిన గోపాల్ యాదవ్ ఈ గేదేలను రవీందర్‌రఎడ్డి, సతీష్‌రెడ్డిల వద్ద కొనుగోలు చేశారు. ఈ ధూలియా గేదే ఉదయం సాయంత్రం కలిపి 28 లీటర్ల పాలు ఇస్తుంది. అలాగే ఎనిమిది గేదేలు రెండు లక్షల ఒక్కొక్కటి చొప్పున అమ్ముడుపోయాయి. ధూలియా, గుజ్జర్ హర్యానా, సోలాపూర్, ముర్రె గేదేలకు డిమాండ్ కనిపించింది. ఇక పుంగనూర్ ఆవును, గుజరాత్‌కు చెందిన ఆవులను 70వేల నుంచి లక్షన్నర వరకు అమ్ముడుపోయాయి. ఇక ఈ సారి పుంగనూరు గేదేలు సందడి చే శాయి.

సమష్టి కృషితోనే అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి ఆశించిన రీతిలో సాధ్య పడుతుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండా, ముర్తోజుపల్లి, జంగారెడ్డిపల్లి, 15వ వార్డు ఉదయ్‌నగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టే సీసీరోడ్ల నిర్మాణాలకు శుక్రవారం కౌన్సిలర్లు కృష్ణనాయక్, విక్రమ్‌రెడ్డి, కృష్ణయాదవ్, లక్ష్మణ్‌లతో కలిసి మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ భూమిపూజ చేశారు. ఆచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వార్డుల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి, పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవిరాథోడ్, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడి.. కొండముచ్చుకు తీవ్రగాయాలు



పెద్దేముల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో కొండముచ్చు తీవ్రంగా గాయపడింది. గాయపడ్డ కొండముచ్చు చెట్టుఎక్కి కూర్చోవడంతో గ్రామ యువకులు కొంతమంది దానిని అనేక రకాలుగా ప్రయత్నించి చెట్టుపై నుండి కిందకు దింపారు. కొండముచ్చును పట్టుకుని పశువైద్య సిబ్బందితో చికిత్సలు అందజేశారు పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామసమీపంలో ఒక కొండముచ్చుపై కుక్కలు దాడిచేశాయి. అదిగమనించిన గ్రామస్థులు కుక్కలను తరిమేశారు. గాయపడ్డ కొండముచ్చు చెట్టుఎక్కి కూర్చుంది. తోకపూర్తిగా తెగిపోయింది. మూతిపైన గాయాలయ్యాయి. గ్రామయువకులు కొందరు అక్కడికి చేరుకుని కొండముచ్చును కిందకు దింపి, పశువైద్య సిబ్బందితో దానికి చికిత్సలు చేయించడంతో గ్రామస్థులు ఆ యువకులను అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు



తలకొండపల్లి, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): పురాతన ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేద్రాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 7 నుంచి 9వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల విజయవంతంపై శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్సీని కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, శ్రీనివాస్ గౌడ్, అజీజ్, తదితరులు ఉన్నారు.

రూ.150 కోట్లతో బషీరాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలో రూ.150 కోట్లతో లక్ష్మీనారాయణపూర్ నుంచి బషీరాబాద్ మండలం మైల్వార్ వరకు నాలుగు లైన్ల రోడ్డును నిర్మించబోతున్నామని, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నవాల్గ, కొర్విచెడ్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలకు హాజరై ఆయన మాట్లాడారు. బషీరాబాద్-జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు రూ.30 కోట్లలో డబుల్ రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆర్థిక భారం ఉన్నా, సంక్షేమ పథకాలు ఆపేదిలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈనెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలను అమలు చేయబోతుందన్నారు. ప్రజా సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియన్నారు. కార్యక్రమంలో నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, వైస్‌చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, మాజీ జడ్పీటీసీలు మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాకేష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరంతర శ్రమతో లక్ష్యాన్ని చేరొచ్చు

పర్వతాధిరోహకురాలు మాలవత్ పూర్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పర్వతాదిరోహకురాలు మాలవత్ పూర్ణ

ఘట్‌కేసర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం శ్రమిస్తూ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలని పర్వతాధిరోహకురాలు మాలవత్ పూర్ణ అన్నారు. శుక్రవారం కొండాపూర్ విజ్ఞాన్ ప్రబోధనంద ప్రశాంత నికేతన్, ఈసీఐఎల్ విజ్ఞాన్ గ్లోబల్ జన్ స్కూల్‌ల సంయుక్తంగా నిర్వహించిన 24వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మహిళగా దృఢ సంకల్పంతో ధైర్య సాహసాలతో గురువులు, తల్లిదండ్రుల పోత్సహంతో ప్రపంచ స్థాయికి ఎదిగినట్లు వివరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేందుకు కృషి చేయాలనాన్నరు. సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో ప్రబోధానంద ప్రశాంత నికేతన్ ప్రిన్సిపాల్ మౌని స్టాలిన్, విజ్ఞాన్ గ్లోబల్‌జెన్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహేశ్వరానికి రానున్న మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకాలి



మహేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహేశ్వరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణకోసం సాగే అంతిమ లక్ష్య సాధనలో భాగంగా నిర్వహించే హైదరాబాద్ సదస్సుకు వేల గొంతులు, లక్ష డప్పుల్లతో కదం తొక్కాలని, 28న మహేశ్వరానికి రానున్న మంద కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలకాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు బక్కని రవి, మండలాధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కల్వకోలు, పెండ్యాల, మన్సాన్‌పల్లి, ఆకన్‌పల్లి, గట్టుపల్లి గ్రామాలల్లో మాదిగ కళాబృందం రథయాత్ర, వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

'అంత్యోదయ' అనర్హులను తొలగించాలి

కందుకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అంత్యోదయ కార్డులలో అర్హులుకాని వారిని అధికారులు ఎంపిక చేశారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి వారిని వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని నేదునూరు మాజీ వార్డు సభ్యులు బీజేపీ నాయకులు డీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో 58మందికి అంత్యోదయ కార్డులున్నాయని, అందులో కొందరు అనర్హులని వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

తలకొండపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రధనకు చెందిన రాజమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం మృతదేహాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు బక్కి కుమార్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆచారి సేవా సమితి ద్వారా రూ.3,500లు ఆర్థిక సాయం అందజేశారు.

చేవెళ్ల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే యాదయ్య
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చేవెళ్ల : ముడిమ్యాల్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం మూడిమ్యాల్, కుమ్మెర, పలుగుట్ట తదితర గ్రామాల్లో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు దశలవారిగా చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి. మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండుయాదవ్, లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ బి.రాములు, మాజీ సర్పంచ్‌లు పాండుగౌడ్, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు రాంరెడ్డి, స్వరూప, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, బూర్ల సాయినాథ్, మండల మహిళా కాంగ్రెస్ కార్యదర్శి సరితారెడ్డి, నరేందర్‌గౌడ్, నరేందర్ యాదవ్, రాములు, జంగారెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో హిమబిందు, ఎంఈవో పురందాస్, డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్ నాయకులు తదితరులున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. పలు అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యత్నిస్తానన్నారు. ఇప్పటికే పెద్దఎత్తున రాష్ట్ర ప్రభుత్వ నిధులు తీసుకువచ్చి సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాలువలు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి. కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్వేతా పాండురంగారెడ్డి, పార్శి రాధ, గోపాల్, శ్రీనాథ్ గౌడ్, అశోక్, రాములు, లావణ్య, నాయకులు గోపాల్‌రెడ్డి, చంద్రమోహన్, మైమూద్ తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్సలు పేదలకు భారం కాకుడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య చికిత్సలకు రూ.10 లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు దారెడ్డి అంజన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. సూదిని శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, జగన్, సూదిని కొండల్ రెడ్డి, సంపత్, తాళ్ల రవీందర్, వెంకటయ్య, అభినవ్‌రెడ్డి, లక్ష్మణ్, బాబా, విజయ్‌రాథోడ్, తదితరులున్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి : మండల కేంద్రానికి చెందిన బాలకిష్టయ్య ప్రమాదవశాత్తు గాయాలపాలై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులనడిగి తెలుసుకొని మెరుగైన వైద్యమందించాలన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం : ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ గురునాయుడు, డీఎం వెంకటనర్సప్ప

ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం డిపోలో డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. డ్రైవర్లు, సిబ్బంది అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతున్న బస్ డ్రైవర్లకు గులాబీ పూలు ఇచ్చారు. ప్రమాద రహిత ఆర్టీసీ డ్రైవర్లు ఎండీ జియావుద్దీన్, పి.వెంకటయ్య, టి.యాదయ్య, హైర్ బస్‌డ్రైవర్లు పి.కృష్ణారెడ్డి, లింగం, మహేష్, క్రైసర్‌లకు సీఐ, డిపో మేనేజర్ వెంకటనర్సప్పల చేతుల మీదుగా అవార్డులందజేసి సన్మానించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలు పాటిస్తే ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్ సూచించారు. కొందుర్గు మండల కేంద్రంలోని కేజీబీవీలో పాఠశాలల ప్రత్యేకాధికారి నిస్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



చౌదరిగూడ : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీందర్ నాయక్

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నందిగామ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సప్పగూడకు చెందిన అంకం కుమార్(32) మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నర్సప్పగూడకు చెందిన కుమార్ శుక్రవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటివారు గమనించి కుమార్‌ను పిలవగా.. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా.. ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో వేళాడుతూ కనిపించాడు. అతడి భార్యకు సమాచారం ఇవ్వడంతో ఇరుగుపొరుగు సహాయంతో డోర్ పగులకొట్టి కుమార్‌ను కిందికి దించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. కాగా, ఇంటి విషయంలో గ్రామానికి చెందిన మంగలి నందమయ్య, రాజు, కుమార్, లింగం, రవి, అనిల్‌లు వారితో తరచూ గొడవ పడేవారని, ఇంటిని కూల్చివేస్తామని బెదిరించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవచ్చని తేజస్విని పేర్కొంది.

మట్టి అక్రమ తవ్వకాలపై ఎస్వోటీ దాడులు

- మూడు జేసీబీలు, రెండు టిప్పర్లు స్వాధీనం

షాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ తవ్వకాలపై ఎస్వోటీ శుక్రవారం దాడులు నిర్వహించి మూడు జేసీబీలు, రెండు టిప్పర్లు, సుమారు వంద టన్నుల ఎర్రమట్టిని స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసింది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు ఎస్వోటీకి పక్కా సమాచారం అందడంతో గురువారం రాత్రి హైతాబాద్ సమీపంలోని పారిశ్రామిక వాడ వద్ద తనిఖీలు చేపట్టారు. సుమారు 90 టన్నుల ఎర్రమట్టి డంపింగ్, ఒక టిప్పర్, రెండు జేసీబీలను పట్టుకున్నారు. శుక్రవారం కూడా నరేడ్లగూడలో ఎర్రమట్టిని తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి టిప్పర్, జేసీబీని పట్టుకొన్నారు. ఈమేరకు వాటిని షాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు

యాచారం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివనపర్తికి చెందిన జాపాల లక్ష్మయ్య(70) గురువారం రాత్రి అదృశ్యమైనట్లు కుటుంబికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి ఇంటి నుంచి బయటకెళ్లారని తెలిసిన చోటల్లా వెతికినా జాడ తెలియలేదని తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

మేడిపల్లి పరిధిలో బాలుడు..

యాచారం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లిలో అదృశ్యమైన బాలుడు గోరిగె భానుప్రసాద్ గురువారం అదృశ్యమైయ్యాడు. బాలుడి కోసం పోలీసులతో పాటు తల్లిదండ్రులు అతడి కోసం గాలిస్తుండగా ఇబ్రహీంపట్నం మండలంలోని శేరిగూడలో తండ్రి బిక్షపతికి చిక్కాడు. తండ్రిని చూసి ఏడ్చాడు. దాంతో తండ్రి తనకుమారుడు దొరికాడని పోలీసులకు సమాచారమందించాడు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లిలో గురువారం అదృశ్యమైన బాలుడు భానుప్రసాద్ దొరికాడు. బాలుడి కోసం పోలీసులతో పాటు తల్లిదండ్రులు గాలిస్తుండగా ఇబ్రహీంపట్నం మండలంలోని శేరిగూడలో బాలుడి తండ్రి భిక్షపతికి చిక్కాడు. తన కుమారుడు దొరికాడని పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

భూ ఆక్రమణకు యత్నం.. పలువురిపై కేసు

చౌదరిగూడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమిలోకి చొరబడి చదును చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కథనం మేరకు.. వనంపల్లి శివారులోని సర్వేనంబర్ 86లో 5.24 గుంటల భూమిలో ఉన్న వెంచర్ రాళ్లను తొలగించేందుకు వనంపల్లికి చెందిన సూరారం పెద్ద యాదయ్య, సూరారం రాములు, సూరారం మల్లేష్, సూరారం చంద్రయ్య, సూరారం రవి, కొందుర్గు గ్రామానికి చెందిన బోయ శంకర్‌లతో పాటు మరి కొంతమంది గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో భూమిలోకి ప్రవేశించారు. డోజర్లు, జేసీబీల సహాయంతో వెంచర్‌లో పాతిన రాళ్లు, రూమ్‌ను కూల్చివేసి భూమిని చదును చేశారు. ఈమేరకు వారిపై చర్యలు తీసుకోవాలని వెంచర్ యజమాని మహ్మద్ అబ్దుల్ ఆజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

జీపీ వర్కర్‌పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కేశంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ పంచాయతీ వర్కర్‌పై అదే గ్రామంలోని ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. సీఐ నరహరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగపోగు రాములు గ్రామ పంచాయతీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం గ్రామానికి తాగునీటిని వదలడానికి వాటర్ ట్యాంకు దగ్గరకు బయలుదేరాడు. మార్గమధ్యలో గ్రామానికి చెందిన గుండోళ్ల జంగయ్య, అతడి భార్య లక్ష్మమ్మ, కుమారుడు శివలు కలిసి రాములుపై దాడి చేసి గాయపర్చారు. అయితే, గతంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బ్యాటని పంచాయతీ అధికారి అనుమతి లేకుండా తీసుకోవడం చూసాడని మనసులో పెట్టుకున్న జంగయ్య కుటుంబ సభ్యులు రాములపై దాడి చేశారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కందుకూరు, మహేశ్వరంలో నేడు మంత్రి పొన్నం పర్యటన

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కందుకూరు/మహేశ్వరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు శనివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మహేశ్వరం, కందుకూరు మండలాలకు వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. రూ.1.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కందుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతోపాటు వివిధ గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గున్‌గల్‌లో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో పాటు వైర్ల కింద చెట్ల నరికివేత కారణంగా నేడు(శనివారం) ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గున్‌గల్, గడ్డమల్లాయగూడ, ఆగాపల్లి, కొమజ్‌ఫట్ గ్రామాలలోని కోళ్ల ఫాంలు, వ్యవసాయదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

యాచారం/కేశంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ ఎరుకల బాలరాజుగౌడ్ రూ.18వేల విలువైన మైక్‌సెట్‌ను అందించా రు. సొంత డబ్బుతో మైక్‌సెట్ అందించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ హర్షం వెలిబుచ్చారు. కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లికి చెందిన రొయ్యల జంగేశ్ తన తండ్రి తిరుపతయ్య జ్ఞాపకార్థం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం సౌండ్ బాక్స్‌లతో పాటు అంప్లిఫయర్‌లను ఉపాధ్యాయులకు అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, తదితరులున్నారు.

'ప్రజలను పక్కదారి పట్టించేందుకే గ్రామ సభలు'

కందుకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు వచ్చే స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికేనని, ఎన్నికల డ్రామాలను వెంటనే ఆపాలని, ప్రజలను పక్కదారి పట్టించేందుకే సభలు పెడుతున్నారని కొత్తగూడ మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌లు సంఘం సంయుక్త కార్యదర్శి సాధ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు సంక్షేమ పథకాలను మంజూరు చేయడానికి ఇప్పటికే రెండు పర్యాయాలు దరఖాస్తులు తీసుకున్నారని, మరోసారి గ్రామ సభల పేరుతో వారి దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచ్‌ల పాలన ముగిసి 12 నెలలు గడుస్తున్నా ఎన్నికలు జరపకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పథకాలకు నిధులు పెండింగ్‌లో ఉన్నా.. పట్టించుకోని కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ముందుకు వచ్చిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మాకెందుకివ్వరు?

- అధికారులను ప్రశ్నించిన ప్రజలు
- రసాభాసగా తాటిపర్తి గ్రామ సభ
- పోలీసుల జోక్యంతో శాంతించిన జనం



యాచారం : తాటిపర్తిలో అధికారులతో వాదనకు దిగిన గ్రామస్తులు..

యాచారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మాకెందుకివ్వరని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు చివరి రోజు పోలీసుల నిఘాలో జరిగాయి. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు రాలేదని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం యాచారం మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి, మొండిగౌరెల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పట్టాభూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశించినా ఎందుకు మాగోడు పట్టించుకోవడం లేదని రైతులను అధికారులను ప్రశ్నించారు. అర్హులకు రేషన్‌కార్డులు రాలేదని, ఇందిరమ్మ ఇళ్లు కూడా అర్హులకు రాలేదని తాటిపర్తి గ్రామసభలో జనం అధికారులతో వాదనకు దిగారు. అర్హులందరికీ రేషన్ కార్డులిస్తామని ఎంపీడీవో నరేందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్‌సాగర్, ఎంపీవో శ్రీలత చెప్పినా జనం వినిపించుకోలేదు. సీఐ నర్సింహారావు కల్పించుకొని సముదాయించినప్పటికీ వినిపించుకోకుండా అధికారులతో వాదనకు దిగడంతో పాటు మైక్‌ను బలవంతంగా కిందవేశారు. ఓ దశలో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. సీఐ లిక్కి. కృష్ణంరాజు అక్కడికి చేరుకొని సముదాయించడంతో జనం శాంతించారు.

జనం గోడు విన్న ఏసీపీ కేపీవీ రాజు

కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పాల్గొని జనం సమస్యలు తెలుసుకున్నారు. తాటిపర్తిలో మాజీ సర్పంచ్ రమేష్‌ను కలిసి ఇబ్బందులను అధికారులకు వివరించాలన్నారు. ఆయన నేరుగా జనం వద్దకెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాటిపర్తిలో ఏసీపీ రాజుతో పాటు ముగ్గురు సీఐలు నలుగురు ఎస్సైలు ఎలాంటి ఆ వాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామసభల్లో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, వ్యవసాయాధికారి రవినాథ్, డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్ సాగర్, ఆర్ఐలు మురళీకృష్ణ, రామకృష్ణలు పాల్గొన్నారు.

మంచాల : జాపాల, లోయపల్లి, బండలేమూర్, అస్మత్‌పూర్, నోములు, తిప్పాయిగూడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారులకు సంబంధించి ప్రజాపాలన క్షేత్రస్థాయి పరిశీలన నివేదికను గ్రామసభల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావులు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమపథకాలు అందేట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్‌యాదవ్, ఎంపీవో ఉమారాణి, ఏపీవో వీరాంజనేయులు, కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల జాబితాలో పేర్లు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఏడీఏ రాజరత్నం, ఎంపీవో లాలయ్య, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, కావలి యాదయ్య, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంచాల : బండలేమూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలశంకర్

ఐదేళ్లలో రూ.169.20 కోట్ల విలువైన పనులు



ఇబ్రహీంపట్నం : చైర్‌పర్సన్ స్రవంతిని సన్మానిస్తున్న కమిషనర్ రవీందర్‌సాగర్, కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పదవీ కాలంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రూ.169.20 కోట్లకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తెలిపారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం మున్సిపల్ పాలకవర్గాన్ని అధికారులు, సి బ్బంది ఘనంగా సన్మానించారు. అంబేద్క ర్ జంక్షన్ నుంచి ఆక్టోపస్ వరకు హెచ్ఆర్‌డీసీఎల్ నిధులు రూ.60 కోట్లు మంజూరైనాయని.. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. వైస్ చైర్మన్ బర్ల మంగ, కమీషనర్ రవీందర్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, పదవుల కన్నా ప్రజాసేవలోనే ఎంతో సంతృప్తి ఉందని అందులో ఉన్న ఆనందం మరేదాంట్లో దొరకదని, ఐదేళ్ల కాలంలో ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు పాలక వర్గంతో పాటు ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతారాజుగౌడ్ అన్నారు. తుక్కుగూడలో పదవీకాల ముగింపు సన్మాన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాటు పాలనా పరంగా కొన్ని రాజకీయ ఒడిదుడుకులు ఉన్నా.. పాలకవర్గం మాత్రం ప్రజా సేవకోసం పరితపించడం గర్వంగా ఉందన్నారు. వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు పద్మశివయ్య, శివకుమార్, తేజశ్విని శ్రీకాంత్, విలాస్, రవి, సుమన్, భావన, లావణ్యరాజు, రాజమోనిరాజు, కమిషనర్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.



మహేశ్వరం : తుక్కుగూడ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న కమిషనర్ వాణి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆమనగల్లు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరి ఆనంద మయ జీవితాన్ని పొందవచ్చునని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన సూరిశెట్టి బాలమణిసింహ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీ కన్వెన్షన్‌లో మురుకుంట్ల రాజేశ్వరశర్మ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సర్వ సౌభాగ్య శ్రీ దేవిత్రయ జ్ఞాన యజ్ఞ కార్యక్రమంలో జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డితో కలిసి యజ్ఞ పతాక పూజ, గోపూజ, అఖండ దీపారాధన కార్యక్రమాలు ప్రారంభించారు. కడ్తాల మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, లక్ష్మయ్య, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ ఏసీ

చేవెళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలో ఉన్న శివాలయాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం శివాలయంలోని అర్చకులు శ్రీపాదు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, అర్థ శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు కమిషనర్‌కు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను గురించి వివరించారు. అనంతరం ఆయన శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ చంద్రమౌళి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో పూజలు నిర్వహించిన అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

సంక్షిప్తంగా..

కడ్తాల్/కందుకూరు : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్‌ను శుక్రవారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు పోతుగంట అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తూరు మండలం జేపీ దర్గాకు వచ్చిన ప్రీతమ్ ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఎస్సీ నిరుద్యోగ యువతి, యువకుల ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని, అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వ పరంగా చూడాలని కోరినట్లు అశోక్ తెలిపారు. కందుకూరు మండల నాయకులు నారాయణ, గాదె కుమార్, బి.సురేష్‌లు ప్రీతంను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కడ్తాల్ : దావోస్ పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రేవంత్ మిత్ర మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రానికి చెందిన రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్అలీ ఆధ్వర్యంలో నాయకులు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు.

కందుకూరు : ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం జరుగుతుందని, మంద కృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమం తుదిదశకు చేరుకుందని ఆ సంఘం మహేశ్వరం నియోజకవర్గం స్థాయి నాయకులు చిత్ర సాయిలు, అందుగుల కృష్ణ, మంద సాయిలులు అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. 28న మంద కృష్ణమాదిగ మహేశ్వరం మండల కేంద్రానికి రానున్నట్లు వారు తెలిపారు. మాజీ జడ్పీటీసీ జె.పెద్దరామయ్య, నాయకులు మస్కు బాబు, కె.నర్సింహ, కె.జంగయ్య, పి.జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం మని షాద్‌నగర్ గ్రేడ్- 1 గ్రంథాలయ శాఖ మీడియా కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్ అన్నారు. లేమామిడి గ్రామ పంచాయతీ తుర్కలపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అల్వాల దర్శన్ గౌడ్ షాద్‌నగర్ గ్రేడ్- 1 గ్రంథాలయ మీడియా కార్యదర్శిగా నియమింపబడడంతో కేశంపేట జర్నలిస్టులు దర్శన్‌ను శాలువతో సత్కరించారు. జర్నలిస్టులు అశోక చక్రవర్తి, నరేందర్ గౌడ్, రమేష్‌గౌడ్, రామకృష్ణగౌడ్, లక్ష్మణ్, ఆంజనేయులు, అంజన్న, రాజశేఖర్, రమేష్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లు : కేరళలో వ్యవసాయ సహకార సంఘాల పనితీరు బాగుందని ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ అన్నారు. సహకార రంగం బలోపేతానికి అక్కడ చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయని ఆయన తెలిపారు. సహకార సంఘాల బలోపేతంలో భాగంగా డీసీసీబీ పాలకవర్గం పీఏసీఎస్ చైర్మన్ లతో కలిసి కేరళలో శుక్రవారం పర్యటించింది. ప్రాథమిక సహకార సంఘాల పనితీరు, మున్నార్ కో-ఆపరేటివ్ సొసైటీ పనితీరును డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించినట్లు ఈ సందర్భంగా గంప వెంకటేశ్ పేర్కొన్నారు.

క్రిమినల్ చర్యలకు పాల్పడితే సహించేది లేదు



మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి

కొత్తూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ చర్యలకు పాల్పడి కేసులు నమోదైతే కాంగ్రెస్ పార్టీ సహించదని, అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటుందని ఆ పార్టీ మున్సిపాలిటీ, మండల శాఖ అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డిలు అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు వసుపుల మహేందర్‌పై ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు కావడంతో పార్టీ అధిష్ఠానం స్పందించిందని, క్రమశిక్షణా చర్యల కింద షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు మహేందర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎంతటివారైనా సరే క్రిమినల్ కేసుల్లో ఇరికితే పార్టీ సహించదన్నారు. పార్టీకి నష్టం కలిగించేవారిని అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. నాయకులు కర్రోళ్ల సురేందర్, అక్కవానిగూడ రాజు, శివకుమార్, పాశం కృష్ణ, కోటీశ్వర్ గౌడ్, జనిగె శివ, తేజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

చౌదరిగూడ/కడ్తాల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులైనవారు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి, కడ్తాల్ మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలతలు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ జనవరి 1లోపు పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.